# గొంగళి

అది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బి.యస్సీ. ఫైనలియర్ తరగతి గది. ముందు వరుసలో కొంత మంది లెక్చరర్లు కూర్చున్నారు. విద్యార్థులంతా ముందు వరుస వదిలి బెంచీలపై కూర్చున్నారు. స్టేజిపైనున్న కుర్చీల్లో లెక్కల మాస్టారు శర్మ, భౌతిక శాస్త్రోపన్యాసకులు సత్యం కూర్చున్నారు. పరీక్షలముందు జరిగే వీడ్కోలు సభ కొరకై ఏర్పాటు చేసిన సమావేశమది.

విద్యార్థుల ముఖాల్లో విషాదం, సంతోషం కలగాపులగంగా వున్నాయి. చదువ యిపోతున్నందుకు, తాము జీవితంలో స్థిరపడబోతున్నందుకు సంతోషంగానే వుంది. కాని ఇన్నేళ్ళుగా కలసి మెలసి ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపిన కాలేజీ జీవితం ముగుస్తున్నందుకు విచారంగాను వుంది. అందులో కొందరికి డిగ్రీ పానవగానే పి.జి.లో సీటు దొరుకుతుందో లేదోనన్న అనుమానంగానూ, దొరికినా యూనివర్శిటీ జీవితమెలా ఉంటుందోనన్న సందేహంగాను ఉంది. మరికొందరు చదువాపి జీవితంలో స్థిరపడదామనుకునేవాళ్ళకు ఉద్యోగం వస్తుందో రాదో, భవిష్యజ్జీవితమెలా వుంటుందోనన్న విచారంగాను వుంది. అల్లరిగా చిలిపిగా 'రారా' 'పోరా' లతో, 'నిక్ నేమ్' లతో ఒకరి నొకరు పిలుచుకుంటూ కాలేజి జీవితాన్ని గొడవ గొడవగా గడిపిన విద్యార్థుల ముఖాల్లోకూడా ఎంతో గాంభీర్యం చోటు చేసుకుంది. తమ నేడిపిస్తూ ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించిన విద్యార్థులు కూడా నేడెంతో ఎదిగినవాళ్ళుగా ఉపాధ్యాయులకు తోడ్పడుతున్నారు. చాలామంది విద్యార్థుల ముఖాల్లో కల్యాణ వైరాగ్యం లాంటిది చూసిన ఉపాధ్యాయులు నవ్వుతున్నారు. తమకు జీవితానుభవం నేర్పిన పాఠాలవల్ల ఉపాధ్యాయులు విద్యార్థుల అల్లరిని కుర్రతనపు చిలిపి చేష్టలుగా మాత్రమే గణించారు. ఆ విద్యార్థుల కిలాటి వీడ్కోలు సభలు ఒక్కసారే కావచ్చుకాని ఉపాధ్యాయులకవి ప్రతి సంవత్సరముండేవే.

లెక్కల మాస్టారు శర్మ దళసరి కళ్ళద్దాల నోసారి దస్తీతో తుడిచి మళ్ళీ కళ్ళకు పెట్టుకున్నాడు. లేచి నిల్చున్నాడు. లెక్చరర్లవైపూ, గంభీర వదనాలతో కూర్చున్న విద్యార్థులవైపూ చూశాడు. వాళ్ళ నుద్దేశించి మాట్లాడటం మొదలుపెట్టాడు:

"ప్రియమైన విద్యార్థులకు, ఉపాధ్యాయ సోదరులకు –

ఈ వీడ్కోలు సభకు నన్ను ముఖ్య అతిథిగా ఉంచినందుకు కృతజ్ఞతలు. ఇంకొద్ది రోజుల్లో మీ పరీక్షలయిపోగానే మీ కాలేజీ చదువు ముగియబోతోంది. ఆటపాటలతో, అల్లరిపనులతో మమ్మల్ని మీరెంత వేధించినా మీపై మాకెలాటి కోపతాపాలు లేవు. మీలో కొందరు ఇంకా పై చదువులకు పోవచ్చు. కొందరు జీవితంలో

స్థిరపడవచ్చు. ఏదేమైనా డిగ్రీ చదువు ముగింపు మీ జీవితాల్లో ఒక ప్రధాన ఘట్టం. మీరు భవిష్యత్తులో లెక్చరర్లు కావచ్చు. టీచర్లు కావచ్చు. ఆఫీసర్లు కావచ్చు. లాయర్లు కావచ్చు. రాజకీయ నాయకులూ కావచ్చు. మరే వృత్తిలోనైనా స్థిరపడవచ్చు. ఏ వృత్తిని స్వీకరించినా మీకు సాధ్యమైనంతవరకు ఆదర్శవంతమైన జీవితాలు గడుపాలని నా ఆకాంక్ష. మీరెక్కడయినా, ఏ సందర్భంలోనైనా ఎదురయితే ఇతడు నా శిష్యుడని సగర్వంగా చెప్పుకోగల స్థితిలో మీరుండాలని నా ఆశ. జీవితానికో ఆశయం కలిగివుండి నీతి నిజాయితీలను వదలకుండా దేశానికుపయోగ పడతారని ఆశిస్తాను. మీ జీవితాలు ఇతరుల కుదాహరణ ప్రాయంగా ఉండాలని కోరుకునే కంటె ఎక్కువగా మీనుంచి నేనేం ఆశించను" అని ముగించాడు శర్మ.

శర్మగారు ఎన్ని ఎదురుదెబ్బలు తాకినా నీతి నిజాయితీలనే నమ్ముకొని జీవిస్తున్నాడు. అతని ఆదర్శాలు, నియమాలు అతన్ని "హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్" కాకుండా నిరోధించినా అతడలాగే వున్నాడు. అతడంటే విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు గౌరవంగానే ఉన్నా అభిమానమే అయినా అతన్ని పిచ్చివాడని పిలుస్తారు; ఒక్కడేం సాధిస్తాడని అనుకుంటారు.

శర్మ ఉపన్యాసం ముగించిన తర్వాత భౌతిక, రసాయనిక, తెలుగు ఆంగ్లం మాస్టార్లు మాట్లాడారు. తర్వాత శర్మగారు లేచి విద్యార్థుల నుద్దేశించి "మీలో ఒక్కొక్కరే వచ్చి మీ జీవిత లక్ష్యాలను, మీ భావి జీవితాన్ని గూర్చి రెండు మాటల్లో చెప్పండి" అని కూర్చున్నాడు.

ఒక్కొక్క విద్యార్థి లేచి తన భావాలను వెల్లడిస్తున్నాడు. ఒకరు తనకు లెక్చరర్ కావడం జీవిత ధ్యేయమని, మరొకరు పెద్ద ఆఫీసర్ నౌతానని, ఇంకొకరు లాయర్ నౌతానని, ఇంజనీర్ నౌతానని రాజకీయాల్లో దిగుతానని రకరకాలుగా చెప్పుతున్నారు. యువకరక్తం వేడిలో నిజ జీవితంలో జరుగబోయే సాధ్యాసాధ్యాల గూర్చి ఆలోచించక తామంతా ఆదర్శంగానే బ్రతుకుతామనీ, నీతి నిజాయితీతో జీవిస్తామనీ, అవినీతి అన్యాయాల నంతం చేస్తామనీ దేశాని కుపయోగపడుతామనీ గంభీరంగా ప్రతిజ్ఞలు తీసుకుంటున్నారు. భవిష్యత్తుమాట ఎలా వున్నా వాళ్ళా మాటలను హృదయపూర్వకంగానే అంటున్నారు. వాళ్ళ మాటల్లో దృఢ నిశ్చయం కొట్టొచ్చినట్టుగా అగుపడుతోంది. చాలా మందిలో తమకే తెలియని ఏదో భావావేశం, ఏదో చేయాలన్న తపన, చేయగలమన్న ధీమా, దేశాని కుపయోగపడాలన్న ఆరాటం ద్యోతకమవుతున్నాయి.

విశ్వనాథ్ ఉపాధ్యాయుల మాటలు విన్నాడు. సాటి విద్యార్థుల మాటలు వింటున్నాడు. అవన్నీ వింటుంటే అతనికెంతో సంతోషంగా వుంది. వాళ్ళు తీసుకున్న ప్రతిజ్ఞలు ప్రకారం జీవితాలు గడిపితే అంతకన్నా కావల్సిందేముందనుకున్నాడు. ఇంతలో అతని వంతొచ్చింది. భయం భయంగా స్టేజిపై కెళ్ళాడు. మొదట ఒకటి రెండు మాటలు తడబడ్డా ధైర్యంగానే చెప్పాడు:

"స్వయం ప్రతిభతో పైకి రావడానికి ప్రయత్నిస్తాను. అలాంటి వాటికే ప్రోత్సాహం కూడా ఇస్తాను. ఏ వృత్తిలో స్థిరపడ్డా నీతి, నిజాయితీలను అమ్ముకోను.

నా ప్రిన్సిపుల్స్‌కు విరుద్ధంగా నడువను. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, లంచగొండితనంలాంటి రుగ్మతలను దగ్గరకు రానివ్వను. మెరిట్‌కే ప్రాధాన్యత నిస్తాను" అని ముగించాడు. అందరు చప్పట్లు చరుస్తుండగా స్టేజి దిగాడు. తర్వాత మిగిలిన కొందరు విద్యార్థులు మాట్లాడారు. స్వీట్లు, టీ పంచారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని, ప్రేమగా కౌగలించుకొని పరీక్ష హాల్లో కలుసుకుందామని విడిపోయారు.

☆ ☆ ☆

పడక కుర్చీలో కూర్చొని దీర్ఘాలోచనామగ్నుడై యున్న విశ్వనాథ్‌కు తన కాలేజీ జీవితం, వీడ్కోలు సభ నాటి శర్మగారి ఉపన్యాసం, తన సాటి విద్యార్థుల మాటలు, తాను తీసుకున్న ప్రతిజ్ఞ గుర్తుకొచ్చాయి. అతని మనసంతా చికాకుగా వుంది. గజిబిజిగా వుంది. పిచ్చిపిచ్చిగా వుంది. తలబ్రద్దలవుతోంది. విపరీతంగా ఆలోచించడం వల్ల తల తిరిగిపోతోంది. రెండు చేతులతో తలనదిమి పట్టుకున్నాడు. ఇంట్లోంచి బయటికివచ్చిన ఆరేళ్ళ కూతురు "ఏమైంది నాన్నా?" అని తండ్రిని పలుకరించింది.

"ఏం లేదమ్మా, నువ్వాడుకో పో" అని కూతుర్ని పంపించాడు.

నాలుగైదు రోజుల క్రితం జరిగిన సంఘటన విశ్వనాథ్‌ను విపరీతంగా బాధించింది. అతనిపై చాలా ప్రభావాన్ని కలిగించింది. అతన్ని తన గత జీవితం గూర్చి ఆలోచింప చేసింది.

ఎన్నో ప్రిన్సిపుల్స్‌తో జీవితంలో అడుగుపెట్టిన తాను ఈ పదిపన్నెండేళ్ల కాలంలో చేసిందేమిటి? తాను తీసుకున్న ప్రతిజ్ఞ నెంతవరకు అమలు చేయగలిగాడు? ఎందువల్ల తాను కృతకృత్యుడు కాలేకపోతున్నాడు? తన బలహీనతవల్లనా?? తనతో ప్రతిజ్ఞ తీసుకున్న ఎంతోమంది సహాధ్యాయులు వివిధ వృత్తుల్లో స్థిరపడి ఘోరంగా పతనమయ్యారు. లంచగొండులుగా, అవినీతిపరులుగా మారిపొయ్యారు. అది వాళ్ళ వ్యక్తిగత బలహీనతలవల్ల కావచ్చు, తమ మాటల్లో దృఢత్వం లేకపోవడంవల్ల కావచ్చు, కాని ఎంతో ఆలోచించి దృఢ నిర్ణయం తీసుకున్న తాను. మనసా వాచా కర్మణా దాన్ని అమలు జరుపడానికి ప్రయత్నిస్తున్న తాను ఎందుకు ఘోరంగా విఫలమవుతున్నాడు? ఎందువల్ల? ఎందువల్ల?? ఎందువల్ల??? అని తననుతానే ఎన్నోసార్లు ప్రశ్నించుకున్నాడు.

భార్య తెచ్చిచ్చిన కాఫీ తాగాడు, మనసు కొంత తేలికపడింది. కుర్చీ లోంచి లేచాడు బెడ్‌రూమ్‌లో కెళ్ళి మంచంమీద పడుకున్నాడు. ఆలోచనలో పడ్డాడు. విశ్వనాథ్‌కు తాను జీవితంలో ప్రవేశించినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన సంఘటనలు ఒక్కొక్కటే జ్ఞాపకం రాసాగాయి.

☆ ☆ ☆

డిగ్రీ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయిన విశ్వనాథ్ ఇంటి ఆర్థిక పరిస్థితి బాగా లేనందువల్ల పి.జి. చేయలేకపోయాడు. కాంపిటీషన్ పరీక్షలు రాయడం మొదలుపెట్టాడు. మెరిట్ ఉన్నా మిగతావి లేకపోవడంవల్ల రెండేళ్ళవరకు ఉద్యోగం సంపాదించికోలేకపోయాడు.

తుదకో పరీక్షలో అత్యుత్తమ మార్కులతో పాసై, ఒకఫీసులో ఆఫీసర్‌గా పోస్టు చేయబడ్డాడు. ఆలస్యం జరిగినా స్వంత తెలివితేటలతో ఉద్యోగంలో ప్రవేశించినందుకు ఉప్పొంగిపోయాడతను. ఆఫీసులో జాయినయ్యాడు. ఏడెనిమిది రోజులు గడిస్తేగాని అతనికా ఆఫీసు పరిస్థితి అవగాహన కాలేదు. ఆ ఆఫీసు అవినీతికి పుట్టినిల్లు, లంచానికి మెట్టినిల్లు. బరువు లేకుండా ఏ ఫయిలూ కదలదు. అందులోని ఒకరిద్దరు తప్ప మిగతా వాళ్ళంతా ఆ పద్ధతిని పెంచి పోషిస్తున్నారు. ఆ ఆఫీసు వ్యవహారాలు చూసిన విశ్వనాథ్ ఆవేదన చెందాడు. జీతానికికాక లంచానికే పనిచేసే ఉద్యోగుల నైజాన్ని చూసి మండిపడ్డాడు. ఆ ఆఫీసునో స్థితికి తేవాలని నిర్ణయించుకున్నాడు.

మొదట ఉద్యోగులందర్నీ నోటిమాటగా హెచ్చరించాడు. ఎలాంటి అవినీతి పనులకు పాటుబడ్డా సస్పెండు చేస్తానని బెదరించాడు. బయట ఒక సర్క్యులర్ పెట్టాడు. సమస్యలున్నవాళ్ళు నేరుగా తనవద్దకు రావచ్చని దాని సారాంశం. మొదట స్టాఫ్ భయపడ్డారు. పనులు చకాచకా సాగిపోతున్నాయి. కాని తమ ఆదాయం తగ్గిపోయిందని మెజారిటీ స్టాఫ్ అసంతృప్తిగా వుంది. ఆఫీసులో వచ్చిన కొద్దిపాటి మార్పును గమనించి విశ్వనాథ్ కొంత సంతృప్తి పడ్డాడు. ఒకవైపు ఉద్యోగులకు, మరోవైపు అన్యాయపు బిల్లులు ముడుపులతో పాస్ చేయించుకునేవాళ్ళకు విశ్వనాథ్ తలనొప్పిగా తయారయ్యాడు. అతని పీడ వదిలించుకోవాలని అంతా ఆలోచిస్తున్నారు. విశ్వనాథ్ ఆ ఆఫీస్‌కొచ్చి నాలుగు నెలలయింది. ఒకరోజు మేనేజరో కాగితం తెచ్చి అతని ముందుంచాడు. విశ్వనాథ్ దాన్ని పరిశీలించి రిజెక్టు చేశాడు.

మేనేజరు కళ్ళద్దాలనోసారితీసి తిరిగి పెట్టుకున్నాడు. "సార్! ఆ బిల్లు మీరు పాస్ చేయాలి" అన్నాడు. "అందులోని విషయాలవల్ల నేను తృప్తిపడలేదు. అందుకై ఆ బిల్లు పాస్ చేయడం కుదరదు" అన్నాడు విశ్వనాథ్.

"అది లోకల్ ఎమ్.ఎల్.ఏ గారి బావమరిదిగారి బిల్లు. పాస్ చేయకుంటే కష్టమవుతుంది" అన్నాడు మేనేజర్.

"అదెవరిదన్నా కానియ్, పాసవడానికి వీల్లేదు" అన్నాడు విశ్వనాథ్.

"సార్, మీరు మరోసారాలోచించండి. అతనికిక్కడ చాలా పలుకుబడుంది. అతన్తో గొడవ బాగుండదు" అన్నాడు మేనేజరు.

"మీరు నాకేం చెప్పొద్దు, వెళ్ళిపొండి" అన్నాడు విశ్వనాథ్.

"సార్! నే ననుభవం మీద చెప్తున్నాను. మీరు నా మాట వినండి" అని మేనేజరు ఏదో చెప్పబోతున్నాడు.

"మేనేజరుగారూ! మీరు వెళ్ళండి" అని గద్దించాడు విశ్వనాథ్. నీళ్ళునములుతూ బయటకెళ్ళాడు మేనేజరు.

అలాగే మరికొన్నిటి విషయంలోనూ జరిగింది. అందరికీ కంటగింపుగా తయారయ్యాడు. ఆశ్చర్యకరమైన విషయమేంటంటే – తా నెవరికోసమయితే న్యాయంగా పనిచేయాలనుకుంటున్నాడో వాళ్ళుకూడా 'లంచాలు పెడితే తొందరగా పనయ్యేది, ఏంటి పీడ' అని విశ్వనాథ్‌ను ఈసడించుకో సాగారు. చివరికో సుముహూర్తంలో విశ్వనాథ్ బదిలీ చేయబడ్డాడు. అయినా అతను చలించలేదు. కాని

అక్కడా అదే తంతు. అతన్ని ఆర్నెల్లకోసారి బదిలీచేస్తూ తీవ్ర మానసిక వేదనకు గురిచేశారు. రోజు రోజుకూ పరిస్థితుల ఒత్తిడులకు తట్టుకోలేకపోతున్నాడు. ఇప్పటికే ఎన్నో కష్టాలు పడ్డాడు. ఇప్ప డతనికి తన స్నేహితు లెందుకు దిగజారారో కొద్ది కొద్దిగా అర్థమవుతుంది. తాను పతనమవడానికి అనేక రకాలుగా రెచ్చగొట్టడం, పరిస్థితులు కల్పించడం జరిగింది. కాని విశ్వనాథ్ ప్రిన్సుపుల్స్ వదులుకోలేదు. కొద్ది రోజులైనా ఒకేచోట ఉండాలంటే కొన్ని చూసీ చూడనట్టుండటం మాత్రం నేర్చుకోక తప్పలేదు. తాను స్వయంగా దిగజారకున్నా తన ఆఫీసులో జరిగే కొన్ని అవినీతి పనులగూర్చి అంతగా పట్టించుకోవడం లేదు......

ఒక ఇంటర్వ్యూలో ఓ వ్యక్తికి జరిగిన అన్యాయాని కతడు చాలా కృంగిపోయాడు. తానే బోర్డు ఛైర్మెన్‌గా వుండి కూడా న్యాయం చేయలేకపోయినందుకు తననుతానే నిందించుకున్నాడు.

విశ్వనాథ్ ఆఫీసులోనే ఓ పోస్టు కింటర్వ్యూ జరిగింది. రాజేశం అనే వ్యక్తి ఇంటర్వ్యూ బాగా చేశాడు. దాదాపుగా అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాడు. మిగతా వాళ్ళెవరూ అతనివలె జవాబివ్వలేదు. అతన్నే సెలెక్టు చేసుకోవాలని విశ్వనాథ్ నిర్ణయం. కాని, ఇంటర్వ్యూకు కొద్దిరోజుల ముందు నుంచే, ఇంటర్వ్యూ సమయంలో కూడా అతనికెన్నో రికమండేషన్ ఉత్తరాలు, ఫోనుకాల్సు, డబ్బు ఆఫర్స్ వచ్చాయి. అయినా ఇంటర్వ్యూ ప్రకారం ఏ పైరవీలేని రాజేశంనే సెలెక్టు చేసుకోవాలని విశ్వనాథ్ అనుకుంటున్నాడు. ఇంటర్వ్యూ చివరి దశకొచ్చింది. ఫోను మ్రోగింది. ఫోనెత్తాడు విశ్వనాథ్. ఫోన్లో మాటలు వింటున్న విశ్వనాథ్ ముఖంలో రంగులు మారుతున్నాయి. అది మంత్రిగారి పి.యే. గారి నుండొచ్చిన ఫోన్ కాల్. అతను ఓ వ్యక్తి పేరు చెప్పి, అతడు మంత్రికి దగ్గరివాడనీ, తప్పకుండా అతనికే ఉద్యోగమివ్వాలనీ లేకుంటే మంత్రిగా రాగ్రహిస్తారని చెప్పాడు. ఏం మాట్లాడకుండా విశ్వనాథ్ ఫోను పెట్టేశాడు. ఇంటర్వ్యూ అయిపోయింది. విశ్వనాథం రాజేశంకే ఉద్యోగమివ్వాలన్నాడు. కానీ అతనితో ఇంటర్వ్యూలో కూర్చున్న బోర్డు మెంబర్లిద్దరు మంత్రిగారి వ్యక్తికే ఇవ్వాలన్నారు. ఆరోజు నిర్ణయం కాలేదు. తెల్లవారి నిర్ణయిద్దామని వెళ్ళిపోయారు.

సాయంత్రం విశ్వనాథ్‌పై ఎన్నో వైపుల నుండి ఒత్తిడి.... ఒత్తిడి..... ఒత్తిడి.... హెచ్చరికలు.... బెదరింపులు....ఫోను కాల్సు.... ఆ పట్టణంలో మంత్రిగారి అనుయాయుల రకరకాల ఒత్తిడి....

అప్పటికే ఎన్నో తాకులు తిని ఎంతోమంది ఆగ్రహానికి గురై నానా బాధలు అనుభవించాడు. స్థిరత్వం లేకుండా తిరగడంవల్ల పిల్లల చదువు ఒక సంవత్సరం నష్టమయింది. ఆర్థికంగా కుడా కృంగిపోయాడు. ఇక దృఢంగా ఉండలేకపోయాడు. అంతరాత్మను నొక్కిపట్టి మంత్రిగారి వ్యక్తికే ఉద్యోగమిస్తూ సంతకం పెట్టాడు. ఒకసారి లొంగిపోయింతర్వాత తన ప్రమేయం లేకుండానే మరెన్నో ఒత్తిడులకు తలవంచాడు. ఇప్ప డతనిలో మునుపటి పట్టుదల లేదు.

ఇప్పు డతనికి స్పష్టంగా అర్థమవుతోంది. యువరక్తంలో మనస్ఫూర్తిగానే తీసుకున్న నిర్ణయాలు ఎలా విఫలమవుతాయో, తామెంత పట్టుదలగా వున్నా చుట్టూవున్న సామాజిక పరిస్థితులెలా దిగజార్చుతాయో అతనికి తెలుస్తోంది. కొందరు తమకు తాము, మరికొంతమంది తమ స్వంత పరిస్థితులవల్ల, ఇంకొందరు ఈ సమాజంవల్ల పతనమవుతారని అతని కర్థమవుతుంది. తన ఆశయాలు ఆదర్శాల పందిర్లు నిర్దాక్షిణ్యంగా కూల్చివేయబడుతుంటే నిస్సహాయంగా చూస్తూ పరిస్థితులతో సర్దుకుపోతున్నాడు విశ్వనాథ్. నాలుగైదు రోజుల క్రితం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ విషయమై జరిగిన సంఘటన అతన్ని మరింత కృంగదీసింది. ఈ సంఘంపై, మనుష్యులపై అసహ్యాన్ని, కసిని కలిగేలా చేసింది.

విశ్వనాథ్ ఆఫీసులో ఒకతను పదవీ విరమణ చేయడంవల్ల ఓ పోస్టు ఖాళీ అయింది. ఆ పోస్టుకు మామూలుగానే డిపార్ట్‌మెంటల్ వ్యక్తులకు ఇంటర్వ్యూ జరిగింది. సాధారణంగా ప్రమోషన్ విషయంలో సీనియారిటీ ఉన్న వ్యకి ఘోరంగా విఫలమైతే తప్ప ఆ పోస్టు ఇతరులకివ్వరు. ఆ ఇంటర్వ్యూలో మొదటివ్యక్తి మనోహర్ అందరికంటె బాగా ఇంటర్వ్యూ చేశాడు. సహజంగానే ఆ పోస్ట్ అతనికే పోతుంది, పోగా తన పని తాను సిన్సియర్‌గా చేసుకుంటూ ఎవరికీ తలవంచని ఆ వ్యక్తంటే విశ్వనాథ్‌కు ఇష్టంకూడా. ఆ పోస్ట్ అతనికే ఇవ్వాలనుకున్నాడు. పోగా మిగతావాళ్ళు ఇంటర్వ్యూ ఏమంత బాగా చెయ్యలేదు. అందులో రంగా, మరో వ్యక్తి చేసిన ఇంటర్వ్యూలు మరీ ఘోరంగా వున్నాయి.

అందులోని కొన్ని సమాధానాలు:

"భారతదేశ మొదటి ప్రధాని ఎవరు?" "ఇందిరాగాంధి."

"కాశ్మీర్ రాజధాని?" "హైదరాబాద్."

"Rama Killed Ravana" అనే వాక్యమిచ్చి, దాన్ని Passive Voice గా మార్చమంటే –

"Ravana Killing Rama" అనేది సమాధానం.

చిన్న బారువడ్డీ లెక్కని కూడా సరిగా చేయలేకపోయారు. వాళ్ళను తిట్టి బయటకు పంపించాడు విశ్వనాథ్.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే – ఎవరినయితే విశ్వనాథ్ తిట్టి బయటకు పంపాడో అందులో ఒకడయిన రంగాకు ప్రమోషనివ్వాలని మిగతా ఆఫీసర్లు పట్టుబట్టారు. విశ్వనాథ్ వాళ్ళపై మండిపడి, మనోహర్‌కే ఇస్తానన్నాడు.

"మనోహర్ పొగరుబోతు, రాజకీయాల్లో తిరుగుతాడు. రంగా చాలా మంచివాడు. వినయ విధేయతలున్న వ్యక్తి. ఇంటర్వ్యూదేముంది? పని కావాలి. ఈ ప్రమోషన్ రంగాకే ఇవ్వాలి" అని విశ్వనాథ్‌ను రకరకాలుగా కన్విన్స్ చేయ ప్రయత్నించారు.

ఇంతకీ మనోహర్ చేసిన తప్పల్లా తనపని తాను చూసుకుంటూ పోవడం, తనపైవాళ్ళకు మాటి మాటికి నమస్కరించకపోవడం, చేతులు నలుపుకుంటూ నిల్చోక పోవడం, పైవాళ్ళ ఇండ్లలోకెళ్ళి మస్కాలు కొట్టకపోవడం, వ్యక్తిత్వంగల వ్యక్తిగా మెలగడం.

ఇతర ఆఫీసర్లెంత కన్విన్స్ చేయ ప్రయత్నించినా విశ్వనాథ్, సీనియారిటీని కాదని ఇంటర్వ్యూలో ఘోరంగా విఫలమయిన రంగాకు ప్రమోష నివ్వడానికి కొప్పుకోలేదు. వాళ్ళేది నిర్ణయించక గదిలో మాట్లాడుకుంటూ ఉండగానే ఒక పేరుమోసిన డాక్టర్ నుండి, పి.డబ్ల్యు.డి ఇంజనీర్ నుండి ఫోన్లొచ్చాయి. వాళ్ళు రంగాకు ప్రమోషనివ్వాలని రికమెండ్ చేశారు. డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ విషయంలోనైనా ఇతరుల జోక్యం ఉండకూడదని విశ్వనాథ్ అనుకున్నాడు. ఏ ఒత్తిడికీ లొంగక మనోహర్‌కే ప్రమోషన్ ఇవ్వాలని సంతకం పెట్టడానికి సిద్ధమవుతున్నాడు. కాని విశ్వనాథ్ ఊహించని విధంగా వాళ్ళ ఆఫీసులోని జూనియర్ ఆఫీసర్ల స్టాఫ్‌లో చాలామంది ఇంటర్వ్యూ గదిలో కొచ్చారు. వాళ్ళకు 'కృష్ణ' అనే గుంటనక్క నాయకత్వం వహిస్తున్నాడు. వాళ్ళను చూసి ఆశ్చర్యపోయాడు విశ్వనాథ్.

"ఏంటిదంతా?" అన్నాడు కోపంగా.

కృష్ణ నక్క వినయం చూపుతూ, చేతులు నలుముకుంటూ నమస్కరించి, మనోహర్‌పై ఏవేవో కల్పించి చెప్పి, రంగా నెంతో మంచివాడుగా చిత్రించాడు. చివరకు –

"మనోహర్‌కు ప్రమోషనిస్తే ఆఫీసు నడువదు. మా ఎవరి సహకారమూ వుండదు. తర్వాత మీ ఇష్టం" అని అర్థం వచ్చే మాటలూ తాపీగా చెప్పాడు. బోర్డు మెంబర్లు కూడా అతన్ని సమర్థించారు.

అందరూ కుక్కపిల్లంటే మేకపిల్లనుకూడా కుక్కపిల్లగా భావించినట్టే అన్ని దిక్కులనుండి మనోహర్‌పై వ్యతిరేకత వచ్చేసరికి విశ్వనాథ్ వాళ్ళ మాటల్లో కొంతైనా నిజముండొచ్చనుకున్నాడు. వాళ్ళ ఒత్తిడికి లొంగిపోయాడు. ఏ వ్యక్తినైతే తిట్టి గది బయటకు పంపాడో అదే రంగాకు ప్రమోష నిచ్చాడు.

తర్వాత నిజం తెలుకున్న విశ్వనాథ్ మనోహర్‌కు జరిగిన అన్యాయానికెంతో బాధపడ్డాడు. రంగా చాలా రోజుల్నుంచి మిగతా వాళ్ళందర్ని కలసి ఈ గూడుపుఠాణి చేశాడని విశ్వనాథ్ తర్వాత తెలుసుకున్నాడు. ఈ నాటకంలో ప్రముఖపాత్ర వహించి రంగాకు అన్ని సలహా లిచ్చిన గుంటనక్క కృష్ణకు రంగా విశ్వాసంగల కుక్కలాంటి సేవకుడని తర్వాత అర్థమయింది విశ్వనాథ్‌కు. తాను ఛైర్‌మెనయినా న్యాయం చేయలేక పోయినందుకు వ్యధ చెందాడు.

☆ ☆ ☆

గత సంఘటనలన్నీ జ్ఞప్తికొచ్చి మానసిక వేదనకు గురయ్యాడు విశ్వనాథ్.

మంచంలోనుంచి లేచాడు. డ్రెస్ చేసుకొని పార్కువైపు నడిచాడు. పార్కులో ఓ చోట కూర్చున్నాడు. అతని కక్కడ గొంగళి కోలాటంగా పెట్టుకొని చెట్లకు నీళ్ళుపోస్తున్న వ్యక్తి కనిపించాడు. ఆ గొంగళిని చూసిన విశ్వనాథ్ మస్తిష్కంలో ఏదో తళుక్కున మెరిసింది. అతని చాలా ప్రశ్నలకు సమాధానం లభించింది.

ఈ సమాజం ఇప్పుడతనికి గొంగళిలా అగుపడుతుంది. "గొంగళిని పీకినకొద్దీ వెంట్రుకలే వస్తాయి. గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు రావద్దనుకోవడం

పేరాశే అవుతుంది. లోపభూయిష్టమయిన సమాజంలో జీవిస్తూ నీతి, నిజాయితీగా బ్రతుకుదామనుకోవడం కేవలం భ్రమ. ఒకరిద్దరు లేక కొంతమంది వ్యక్తులు ఆదర్శవంతంగా, నీతిమంతంగా ఉండ ప్రయత్నించినంత మాత్రాన ఒరిగేదేం లేదు. వాళ్ళుకూడా క్రమక్రమంగా ఈ సమాజపు గొంగళిలో వెంట్రుకలుగా మారుతారు" అనుకున్నాడు.

తానెంత ఆదర్శంగా ఉందామనుకున్నా ఎందువల్ల విఫలమయ్యాడో తెలుసుకున్న విశ్వనాథ్ సమాజాన్ని కసిగా తిట్టుకున్నాడు. ఇప్పు డతడు కేవలం ఆదర్శాలు, ఆశయాలగూర్చి మాత్రమే ఆలోచించడం లేదు. అంతకంటే ఉన్నతమైన సమాజంగూర్చి నిరంతరం ఆలోచిస్తున్నాడు. అతని కిప్పుడు ఆదర్శాలు, ఆశయాలనేవి ఆ ఉత్తమ సమాజ వృక్షానికి గల చిన్న కొమ్మలుగా మాత్రమే అగుపడుతున్నాయి.

● 'అంకితం' సాహిత్య మాసపత్రిక (1984)లో ప్రచురితం ●

★ ★ ★